# పరిష్కారం .....

మన్నెం శారద

నేను కోర్టుకి బయల్దేరబోతుండగా ఫోను గణగణ లాడింది. చిరాగ్గా రిసీవర్ని హుక్‌మీద నుంచి ఎత్తి నేను అవతలివైపునుంచి జాహ్నవి గొంతు విని సంతోషంగా "ఏంటి జానీ!" అన్నాను.

"ఇంత దూరం నుంచి నా గొంతు గుర్తు పట్టేసేవా ఆంటీ!" అంది జాహ్నవి ఆశ్చర్య పోతూ.

"నువ్వు మా చేతుల మీద పెరిగిన పిల్ల వోయ్! హైద్రాబాదు నుంచే కాదు, అమెరికా నుంచయినా గుర్తించగలను. ఇంతకీ ప్రొద్దుటే ఫోన్ చేశావ్, ఏంటి సంగతి?" అన్నాను.

"ముఖ్యమైన సంగతే. అమ్మ సాయంత్రం మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌కి బయల్దేరుతోంది. రేపు స్టేషన్‌లో రిసీవ్ చేసుకోవూ!" అంది జాహ్నవి వేడుకోలుగా.

"నేను రిసీవ్ చేసుకోపోతే మీ అమ్మ మద్రాస్‌లో తప్పిపోతుందా? మీ అమ్మ ఇక్కడే చదువుకుని పాతి కేళ్ళు కాపురం వెలగబెట్టింది" అన్నాను జాహ్నవిని ఉడి కిస్తున్నట్టుగా.

"అది కాదాంటీ, అమ్మ ఆరోగ్యం బాగాలేదు. సరిగ్గా రాగలదో, లేదోనని" అంది.

ఈసారి నేను ఉలిక్కిపడ్డాను.

"ఏం జరిగింది జానీ! ఏంటి ట్రబుల్?" అన్నాను ఆదుర్దాగా.

"నథింగ్ టు వర్రీ ఆంటీ! అమ్మ మొన్న డాబా మీద నుంచి దిగుతూ కొద్దిగా స్లిప్పయి పడింది. అప్పట్నుంచీ రికవర్ కాలేదు."

"అంటే ఫ్రాక్చర్స్ ఏవైనా...."

"నో! నో! అసలు జారింది మూడు మెట్ల పైనుంచే. ఎక్స్‌రే తీయించేను. కొద్దిగా బెణకడం మినహాయించి పెద్ద దెబ్బలేం తగల్లేదు. ఇప్పుడు అది కూడా లేదు. షి ఈజ్ ఫిజికల్లీ ఆల్‌రైట్!" అంది జాహ్నవి.

"దెన్ వాట్?" అన్నాను ఆశ్చర్యంగా.

"మమ్మీ ఎందుకో ఈమధ్య ఎవరితోనూ మాట్లాడడం లేదు. అన్నయ్య కూడా ఈ మధ్య చాలా వర్రీ అవుతున్నాడు. అంత యాక్టివ్‌గా వుండే అమ్మ అలా స్తబ్దంగా వుండడం చూస్తుంటే నాకు చాలా దిగులుగా వుంది ఆంటీ" అంది జాహ్నవి. ఆ అమ్మాయి గొంతులో నొక్కి పట్టిన దుఃఖం వణుకు రూపంలో నా చెవుల్ని సోకుతోంది.

జాహ్నవి చిన్నపిల్లేం కాదు. ఎం.ఎస్. చేసి ఆరేళ్ళుగా డాక్టరు వృత్తిలో వున్న వ్యక్తి. అయినా తల్లి బాధకి కారణం కనుక్కోలేకపోతోందంటే నమ్మశక్యం కావడంలేదు. 'ఒకవేళేమైనా ఏదైనా దాస్తోందా?' అని కూడా అనిపించింది నాకు.

"ఏవీ అనుకోకపోతే మీ వదిన ఏదైనా హర్ట్ చేసిందా, కొత్త పిల్ల కాదూ!" అన్నాను.

"ఛ! అదేం లేదాంటీ. వదిన చాలా మంచిది.



అమ్మని దేవతలా చూస్తోంది.''

''మరి ఏమిటమ్మా మిస్టరీ!'' అన్నాను.

''అది నువ్వే తెలుసుకోవాలాంటీ! అమ్మ, నువ్వు ఎంత క్లోజ్ ఫ్రెండ్సో నాకు తెలుసు. ఏదైనా వుంటే అమ్మ నీకు తప్పక చెబుతుంది. అందుకే బలవంతంగా నీ దగ్గరికి పంపుతున్నాను.''

''ఏవిటీ దాన్ని నా దగ్గరికి పంపడానికి బలవంతం కూడా చెయ్యాల్సొచ్చిందా? అంత మారిపోయిందా?'' అన్నాను కోపంగా.

''కోపం తెచ్చుకోకు ఆంటీ. అమ్మ అలా మారిపో బట్టే గదా ఈ బాధ! నేను లెటర్ రాస్తాను. అమ్మకీ సంగతులేం చెప్పకుండా రిసీవ్ చేసుకో. వీలయితే నాల్రోజులు కోర్టుకి డుమ్మా కొట్టేసేయ్! ఏం?'' అంది జాహ్నవి నవ్వుతూ.

''ఏం స్వార్థమే నీకు! మీ అమ్మకోసం నేను కోర్టుకి శలవు పెట్టేయాలా? నువ్వు మాత్రం ఇంచక్కా లేని రోగాలు సృష్టించి రెండు జేబులూ...సారీ! రెండు సారు గులూ నింపుకుంటావన్నమాట!'' అన్నాను విష్కారం నటిస్తూ.

'నా వృత్తి ప్రాణాలకి సంబంధించింది. నువ్వు కోర్టు కెళ్లకపోతే నష్టం ఏమీ రాదులే! నల్గురు నిర్దోషులు శిక్ష తప్పించుకుని బయటపడ్తారు. తిమ్మిని బమ్మి చేయడమేగా మీ లాయర్ల పని!'' అంది నవ్వుతూ.

జాహ్నవి జోక్‌కి నేనూ నవ్వి, ''అమ్మ ఏం చేస్తోంది!'' అన్నాను.

''కోఠి వెళ్లింది. నీకు గద్వాల చీర కొనడానికి.''

''నా చీరల పిచ్చి సంగతి మరచిపోలేదన్న మాట!''

''నిన్ను ఏ విషయంలోనూ మరచిపోదాంటీ! నీ దగ్గరకనగానే అమ్మ ముఖంలో మార్పొచ్చింది. వుంటాను. బై!'' అంటూ ఫోను పెట్టేసింది జాహ్నవి.

* * *

వైదేహితో నా స్నేహం ఈనాటిది కాదు. ఇద్దరం కలసి విజయవాడలో గ్రాడ్యుయేషన్ చేశాం. తర్వాత వైదేహి కొన్నాళ్లు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసింది. అప్పుడే జగదీశ్వర్రావుగారితో పరిచయమైంది. ఆ పరిచయం ప్రణయానికి దారితియ్యడంతో పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకున్నారు. నేను లా చేస్తూ మద్రాసులో వుండిపోవడంతో వాళ్ల ప్రేమ-పెళ్లి విషయాలు అంతగా పట్టించుకోలేదు. నేను ప్రాక్టీసు పెట్టిన సంవత్సరానికి వైదేహి, జగదీశ్వర్రావుగారు మద్రాసు వచ్చి సెటిలయ్యారు. మద్రాసు నుంచి వచ్చే ఒక ప్రముఖ దిన పత్రికకి ఆయన చీఫ్ సబ్ ఎడిటర్‌గా పనిచేసేవారు. ఆ రోజుల్లోనే జగదీశ్వర్రావుగారితో వచ్చే క్రిష్ణతో పరిచయమైంది నాకు. క్రిష్ణ ఆ పత్రికకి రిపోర్టర్‌గా పనిచేస్తుండేవాడు. చివరికి మా ఇద్దరి పరిచయం పెళ్లికి దారితీసింది. మా పెళ్లి కూడా పెద్దలు అంగీకరించకపోవడంతో వైదేహి, జగదీశ్వర్రావుగార్లే దగ్గరుండి పెద్దరికం వహించేరు. దాంతో మా స్నేహం మరింత గట్టిపడింది.

వైదేహి చూడడానికి చాలా నిరాడంబరంగా కనిపించేది. ఆశయాల్ని వల్లించడం, ఆవేశపడుతూ లెక్చర్లు దంచడం ఆమెకు చేతకాని పని. చేతల ద్వారా ఆమె కులాంతర వివాహాల్ని ప్రోత్సహించేది. వాళ్లిద్దరూ ఎన్నో అలాంటి వివాహాలకి క్రర పెత్తనమే కాకుండా చేతనైనంతగా సహాయపడేవారు.

క్రిష్ణకి, నాకు కొన్ని అభిప్రాయభేదాలు తల ఎత్తినప్పుడు వైదేహి ఎన్నో గంటల కాలాన్ని నాకోసం వెచ్చించి సర్దడానికి ప్రయత్నాలు చేసింది. అప్పుడు జాహ్నవి రెండేళ్ల పిల్ల. అరుణ్ ఇంకా పుట్టలేదు. కాని, మా మధ్య వచ్చిన విభేదాలు మామూలు సంసారానికి సంబంధించినవి కావు. క్రిష్ణకి స్త్రీలంటే వున్న న్యూనతాభావం నా అహాన్ని దెబ్బతీయడంతో సహజంగా ఒక పాలు ఆవేశం ఎక్కువయిన నేను సమర్థించుకోలేకపోయాను. నా ఆత్మ గౌరవం మా మధ్య వున్న అనురాగాన్ని జయించింది. దాంతో నేను అతన్నుంచి విడాకులు తీసుకోక తప్పలేదు.

మేము విడిపోవడం వైదేహికి, జగదీశ్వర్రావుగారికి ఎంతో బాధని కల్గించింది. ఎందుకంటే వాళ్ల దృష్టిలో మేమిద్దరమూ మంచి వాళ్లమే! ఎవర్నీ తప్పు పట్టడానికి కాని, మందలించడానికి కాని వాళ్లకి వీలవలేదు.

''ఇండివిడ్యువలిటీ సమపాళ్లలో వున్న స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా ఎక్కువ కాలం కలసి వుండలేరు. ఏం చేస్తాం?'' అన్నారు జగదీశ్వర్రావుగారు విచారంగా.

తర్వాత మేమిద్దరం కూడా మరో వివాహం చేసుకునే ప్రయత్నం చేయలేదు. స్త్రీగా నేను చేసుకోకపోవడంలో అంత విచిత్రం కాదు కాని, క్రిష్ణ ఇప్పటికీ అలానే వుండిపోవడమే చాలా ఆశ్చర్యపడవలసిన సంగతి.

''కరుణని నువ్వంతగా ప్రేమిస్తున్నప్పుడు ఇలా విడిపోవడాలు దేనికి? ఆ డైవోర్సు కేన్సిల్ చేసుకోకూడదూ!'' అని కూడా ఆయన ఒకసారి హెచ్చరించారట.

''గులాబీ పువ్వు అందంగా వుందని ముళ్ల కంపని కౌగిలించుకునే మనస్తత్వం కాదురా నాది! కరుణ అభిప్రాయాలు మగవాడి అహాన్ని క్షణ క్షణం రెచ్చగొట్టేవి. అయ్ కాంట్ ఎడ్జస్ట్ విత్ హర్!'' అని క్రిష్ణ అన్న సంగతి తెలిసి నేను కూడా రెచ్చిపోయాను.

''మాలతీ లత మామిడి చెట్టుని అల్లుకొంటుందేమో కాని తుమ్మ మొద్దుని కాదు'' అన్నాను కసిగా.

ఎంత దర్పంగా మాట్లాడినా రాత్రయ్యేసరికి ఒంటరితనాన్ని బాపుకోలేకపోయేదాన్ని. నా బాధ చూసి వైదేహి నన్ను తీసుకెళ్లి వాళ్ల ఇంట్లోనే అట్టిపెట్టుకుంది.

అలా నాకు జాహ్నవి, అరుణ్ చాలా అలవాటయిపోయారు.

జాహ్నవి తొమ్మిది సంవత్సరాల పిల్లగా వున్నప్పుడు జగదీశ్వర్రావుగారికి హార్టెటాక్ వచ్చింది. హాస్పిటల్‌కి వెళ్లే లోపునే ఆయన ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. ఏ దురలవాటూ ఎరుగని జగదీశ్వర్రావుగారు అలా మరణించడం చెప్పలేని దిగ్భ్రమకి గురిచేసింది. వైదేహిని వూరడించడానిక్కూడా ధైర్యం చాల్లేదు. ఎంతో అన్యోన్యంగా వున్న ఆ జంటని దేవుడు నిర్దాక్షిణ్యంగా విడదీయడాన్ని భరించలేకపోయాను.

కాని...చాలా విచిత్రంగా వైదేహి ఆ పెను తుపాను తాకిడి నిలదొక్కుకుని బిడ్డల్ని దగ్గరికి తీసుకొంది. చిన్న పిల్లలా ఏడుస్తున్న నన్ను ఊరడించింది. ఎంతో మనో




# క్రాంతదర్శి

కాంత ఉద్యమింపకానిది లేదంచు
కాలగతులు తెలుపగలుగు నెపుడు
నరకుడైన గాని, నరరూప రాక్షసుం
డైనగాని కూలు నవనిపైని!

కడు ప్రసన్నమైన కనుదోయి చూపులే
కెంపు నెలమి పుక్కిలింపగలవు
తివిరి నల్ల మబ్బు తెరలను తొలగించి
చందమామనెక్కి సాగగలవు!

కళల నీనుచుండు కరకంకణంబులే
విష్ణు చక్రములుగ వెలయగలవు
కారు నలుపు గుండె గాలమై నర్తించి
రవ్వ లవని మీద రాల్పగలవు!

మగువ పాదయుగళి మంజీర నాదంబు
యుద్ధ భేరి యగుచు నురుమగలదు
విలయ కాలభయద విన్యాస మొనరించి
శాంతి పథము సృష్టి సలుపగలదు!

తనదు తనువు తాన దహియించుకొనుచును
మొలక నవ్వు పువ్వులొలుక గలదు
అంధకార పటలినంతంబు కావించి
నిండు పున్నమి నిలనిలుపగలదు!

\- ఎం.పి. జానుకవి

నిబ్బరంతో 'సింధూర' అనే స్త్రీల మాస పత్రికని స్థాపించి ఎడిటర్‌గా నడపసాగింది.

ఆమె మన స్థయిర్యానికి నేనెంతగానో విస్తుపోయాను. జగదీశ్వరరావుగారి మరణం ఆమెనెంతగానో కృంగదీస్తుందని, ఆమె వ్రేళ్లతో సహా పెకిలించబడ్డ వృక్షంలా కూలిపోతుందని అనుకున్న నేను ఆమె తిరిగి మామూలు విధులకు హాజరవడాన్ని చూసి ఆశ్చర్యపోయాను.

తిరిగి నేను ఆమె కంటి నుంచి ఒక నీటి బిందువుని కూడా చూడలేదు. పత్రిక వ్యవహారాలతోపాటు ఆమె జగదీశ్వరరావుగారు నిర్వహించిన సంఘ సంస్కరణ కార్యక్రమాల్ని కూడా సక్రమంగా నిర్వర్తించేది.

ఒకరోజు ఆగలేక "నీ స్థయిర్యం చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తోంది వైదేహీ! నువ్వెలా అన్నయ్యని మరచిపోగల్గేవు?" అన్నాను.

ఆమె శుష్కంగా నవ్వి, "నేను ఆయన్ని మరచిపోయేనని ఎందుకు భావిస్తున్నావు? ఆయన ప్రతిరూపాలైన పిల్లల్ని గాలికి వదిలేసి నేను ఏడుస్తూ కూర్చుంటే వాళ్ల భవిష్యత్తు ఏమై పోవాలి? పిల్లలు కొరగాకుండా పోతే ఆయన ఆత్మ శాంతిస్తుందా? ఆయన వదిలేసి వెళ్లిపోయిన బాధ్యతల్ని నిర్వర్తించడమే నా జీవితానికి మిగిలింది" అంది ఆవేదనగా.

"నన్ను క్షమించు, అర్థం చేసుకోకుండా మాట్లాడానేమో!" అన్నాను బాధగా.

"ఇందులో క్షమాపణ కోరేదేముంది" అంది నవ్వుతూ.

'ఆ తర్వాత వైదేహి పిల్లల్ని సున్నితంగా ట్రీట్ చేస్తూ క్రమశిక్షణగా పెంచి పెద్ద చేసింది. జాహ్నవిని డాక్టరుగా, అరుణ్‌ని ఇంజనీరుగా తీర్చిదిద్దింది. జాహ్నవి ఇష్టపడిన ప్రదీప్‌తో వివాహం జరిపించింది. కట్నం తీసుకోకుండా అరుణ్‌కి పెళ్లి చేసింది. వాళ్లకోసం పత్రికను వేరే సంస్థకి అమ్మేసి వాళ్లతో పాటు హైద్రాబాదు వెళ్లిపోయింది. పిల్లలే లోకంగా బ్రతికిన వైదేహిలో భర్త పోయినప్పుడు కూడా చోటుచేసుకోని స్తబ్ధత ఎలా ఇప్పుడు చోటు చేసుకుంది!

ఎందుకు వైదేహి అలా మారిపోయింది?' ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఏమైనా రేపు వైదేహిని కలుసుకోబోతున్నానన్న ఆనందం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఆ రాత్రి నిద్ర పట్టలేదుకూడా.

* * *

రైలు దిగుతూ నీరసంగా నవ్వింది వైదేహి.

వైదేహి రూపాన్ని చూసి ఆశ్చర్యపోయాను. ఒక్కసారే వృద్ధాప్యం మీద పడినట్టుగా మొహం వడిలిపోయింది. శరీరం కృంగిపోయింది. వెలిగిపోయిన నేత చీరతో, జారిపోతున్న వేలుముడితో భారంగా దిగుతున్న వైదేహికి చెయ్యందించేను ఆప్యాయంగా. నా చేతిమీద తన భారాన్నంతా మోపి దిగింది వైదేహి.

కారులో ఏం మాట్లాడలేదు నేను.

ఇంటికి చేరాక తనకిష్టమైన పెసరట్లు టిఫెన్ చేసి పెట్టాను.



"నా ఇష్టాలు మరచిపోలేదే నువ్వు!" అంటూ కొద్దిగా తిన్నది వైదేహి.

"అదేం, నేను స్వయంగా కోర్టుకి శెలవు పెట్టి మరీ చేస్తే అంతే తిన్నావు" అన్నాను నిష్ఠూరంగా.

"ఆకలి చచ్చిపోయింది కరుణా!" అంటూ లేచి పోతున్న వైదేహిని మరేం రెట్టించలేదు నేను.

వైదేహిని ఒక క్షణం కూడా వదలకుండా కబుర్లతో ఊదరగొట్టేశాను. పాండీ బజార్, పానగల్ పార్క్, మౌంట్ రోడ్డు, మెరీనా బీచ్.... మద్రాసంతా తిప్పేను. అయినా వైదేహిలో ఉత్సాహం చోటుచేసుకోలేదు.

చివరికి తెగించి "వైదేహీ, నీలో చాలా మార్పొచ్చింది!" అన్నాను.

"జీవితం పడమటకి వాలుతుంటే మార్పురాకుండా ఎలా వుంటుంది" అంది నిర్లిప్తంగా.

"అది కాదు నే మాట్లాడుతూంట. వయసు నీ కొక్కదానికే మీదపడిందా, నేనూ నీ వయసుదాన్నే! ఇలా అయిపోయానా! ఆ మాటకొస్తే నీకు నీ పిల్లలు, మనవలూ వున్నారు. నాకెవరున్నారు చెప్ప!" అన్నాను.

వైదేహి కాస్సేపు మాట్లాడలేదు.

"పిల్లలకి ఎప్పుడో రెక్కలొచ్చాయి. వాళ్ల సంసారాలు వాళ్లవి. నా అవసరం ఇప్పుడెవరికుంది?" అంది.

"అంటే వాళ్లు నిన్ను నిర్లక్ష్యం చేస్తున్నారంటావా?"

"లేదు. నా అవసరం లేదని మాత్రమే చెబుతున్నాను."

"నీ పిచ్చిగాని అవసరం లేకపోవడమేంటి, జాహ్నవి పిల్లల బాధ్యత నీది కాదా, రేపు అరుణ్‌కి పుడితే వాళ్లని చూడనవసరం లేదా? తల్లితో పిల్లలకి అవసరం తీరడమంటూ వుండదు" అన్నాను మందలింపుగా.

వైదేహి తల దించుకుంది. ఆమె కళ్లలోంచి నీళ్లు టప్పున జారిపడ్డాయి.

నేను ఉలిక్కిపడ్డాను.

"వైదేహీ, ఏడుస్తున్నావా?" అన్నాను కంగారుగా.

వైదేహి నవ్వడానికి ప్రయత్నించింది.


"ఎందుకో కరుణా, నా మనసు చాలా బలహీనమైపోయింది. నా పిల్లలు మంచివాళ్లే! నాకోసం తపించిపోతారు. కాని ఏదో బాధ, నా జీవితం ఇక అనవసరమని చెబుతోంది. మనవలు ఊటీలో చదువుతున్నారు. పిల్లలు ఉద్యోగాల పేరిట ఇంట్లో వుండరు. వచ్చినా వాళ్ల సంసారాలు వాళ్లవి" అంది.


నాకు పరిస్థితి అర్థమయింది.

ఈ సమస్య ఎలా తీర్చాలా అని ఆలోచిస్తూ కూర్చున్నాను.

* * *

వారం రోజుల తర్వాత జాహ్నవి నుంచి వైదేహికి






ఫోనొచ్చింది.

'మీ అమ్మాయి మాట్లాడుతోంది' అంటూ రిసీవర్ వైదేహికి అందించి ఆమె ముఖ భంగిమల్ని గమనిస్తూ కూర్చున్నాను.

వైదేహి మొహంలో ఎంతో మార్పు వచ్చింది.

"అలాగే! అలాగే! రేపే బయల్దేరుతున్నాను. నీకే బెంగా అక్కర్లేదు. నువ్వేం కంగారు పడకు!" అంటూ ఫోను పెట్టేసి "రేపు నేను హైదరాబాదెళ్లాలి. టిక్కెట్టు తెప్పించవూ!" అంది.

"రేపే అంటే ఎక్కడ దొరుకుతుంది? అయినా వెళ్లొచ్చులే! ఏ అవసరం లేని వాళ్లకోసం అంత ఆరాటం దేనికి?" అన్నాను ఓరగా చూస్తూ.

"అది కాదు. ఊటీ పంపిన పిల్లలకి జబ్బు చేసిందట. అందుకని తిరిగి తీసుకొచ్చేశాడట అల్లుడు. నే వెళ్తే కాని వాళ్లని ఎవరు చూస్తారు?" అంది.

"బావుంది. ఆ పిల్లలకి తల్లివి నువ్వు కాదుగా! వాళ్ల పిల్లల్ని వాళ్లు చూసుకోలేరూ!" అన్నాను.

"వాళ్లు నా వళ్లో పెరిగారు. నేను రాకపోతే వాళ్లనెవరు చూస్తారు! ట్రెయిన్ టిక్కెట్ దొరక్కపోతే ఫ్లయిట్‌కి పంపించేయ్!" అంది వేడుకోలుగా.

"సరే!" అన్నాను.

* * *

మర్నాడు మీనంబాకం ఎయిర్‌పోర్టులో వైదేహిని ఫ్లయిట్ ఎక్కించి, ఇంటికొచ్చి జాహ్నవికి ఫోన్ చేశాను.

"మీ అమ్మ బయల్దేరింది. మరో గంటలో మీ ముందు వుంటుంది" అన్నాను.

"అమ్మ మారిందా?" అంది ఆత్రుతగా.

"ఆ! ఎంతో ఉత్సాహంగా పరుగెత్తుకొస్తోంది."

"థాంక్స్ ఆంటీ! నీ ప్లాన్ పారింది" అంది.

"మీ నాన్న అర్థాంతరంగా పోయినా ఆమె మీ కోసం బతికింది. మీ సంసారాలు మీకొచ్చేక తన పని ముగిసిపోయినట్టుగా ఒంటరితనం ఫీలవుతోంది. కనీసం మన వల బాధ్యతనైనా ఆమె నెత్తిన లేకపోతే ఆమె మానసికంగా కృంగిపోతుంది. అందుకని ఆమెకు ఏ పనీ లేకుండా చేయకండి. ఆమె అవసరం చాలా వున్నట్టు ప్రవర్తించండి" అన్నాను.

"థాంక్యూ ఆంటీ! అలాగే చేస్తాను. అమ్మని రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్‌పోర్టుకి వెళ్లాలి!" అంటూ ఫోన్ పెట్టేసింది జాహ్నవి.

ఒక సమస్య తీర్చగలిగినందుకు నాకూ సంతోషం కలిగింది.

●


With best compliments from:

*Grams: "AGROOILS"*

**Phone: 367**
**2150**
**2344**
**M.D's Res: 997**
2435

Postal Address:
**Post Box No. 6,**
**GUDIVADA - 521 301**

Factory & Regd. Office:
**Mallayapalem,**
**GUDIVADA- 521 301**

# The Krishnaveni Agro Oil Products Private Limited

MALLAYAPALEM : **GUDIVADA**
Andhra Pradesh

Continuous Solvent Extraction Plant of 150 M.T.D. capacity. Manufacturers of Edible Grade Rice Bran Oil/ Non- Edible Grade Rice Bran Oil and Deoiled Rice Bran as per InternationalSpecifications for export to eastern & East European Contries.